# పారిజాతాపహరణం

"పారిజాతం కనపడ్లేదుట ..."

"పారిజాతం ఇంట్లోంచి వెళ్లిపోయిందట." ఆ రోజు తెల్లవారుతూనే ఆ వీధిలో గుప్పుమంది. ఆ నోటా ఆనోటా ఇళ్లిళ్లూ అదే మాట.

"నిన్న సాయంత్రం నాతో అరగంటసేపు కబుర్లు చెప్పింది కూడాను. మామూలుగానే మాట్లాడింది మరి తెల్లవారేటప్పటికి ఇంట్లో లేకపోవడం ఏమిటో" పారిజాతం వాళ్ళ పక్కింటి కమల వాళ్ళాయనతో అంది యథాలాపంగా.

"దాంట్లో ఆశ్చర్యమేముంది ? తెల్లారేటప్పటికి లేదు అంటే రాత్రి వాళ్ళింట్లో అందరూ నిద్రపోయాక తెల్లారేలోపల ఎప్పుడో అప్పుడు ఇంట్లోంచి వెళ్లిపోయినట్లు తెలుస్తూందిగ" గడ్డం గీసుకుంటూ, తాపీగా అన్నాడు శివరావు.

"అయ్యోరామ .... అంతమాత్రం నాకు తెలుసులెండి. గుండెల్లో దిగిన కత్తితో హతుడు చచ్చిపడుంటే హంతకుడు కత్తితో పొడిచి చంపాడని పోలీసులు కనిపెట్టారు అని చెప్పినట్టుంది మీ మాట."

" డాడీ డాడీ వాటీస్‌ది డెఫినెషన్ ఆఫ్ సైన్స్.... ఆన్సర్ చెప్పవా రాసుకుంటాను " చేతిలో సైన్స్ పుస్తకంతో దగ్గరకొచ్చాడు, కాన్వెంట్లో చదువుతున్న చిన్నకొడుకు. హోమ్‌వర్క్ పూర్తిచెయ్యలేదు కాబోలు వాడి గొడవ వాడిది.

" నేను చెప్తాను. రా రా " పెద్దవాడు కేకేశాడు తమ్ముడిని.

" వాడు చెప్తాడట వెళ్ళు " చిన్నవాడిని అటు తోసింది కమల, మంచి ఇంటరెస్టింగ్ టాపిక్ మాట్లాడబోతుంటే మధ్య వీడేమిటి పానకంలో పుడకలా అని.

" ఊ .... చెప్పు అన్నయ్యా నేను రాసుకోవాలి "

" ది డెఫినిషన్ ఆఫ్ సైన్స్ ఈజ్ నాన్ సెన్స్ " అనేసి అక్కడనుంచి ఒక్కపరుగుచ్చుకున్నాడు పెద్దవాడు.

" చూడు డాడీ .... నిజంగా ఆన్సర్ చెప్తాడనుకున్నాను. ది డెఫినిషన్ ఆఫ్ సైన్స్ ఈజ్ నాన్ సెన్సుట." అన్నయ్య మీద కోపం వస్తూంది ఒక పక్క నవ్వూ వస్తూంది మరోపక్క.

" ఇదిగో నాన్ సెన్సూలేదు గోనెసంచీ లేదు. అసలు మమ్మల్ని కాసేపైనా మాట్లాడుకోనివ్వవా ఏమిటి ? " చిరాకు చూపించింది కమల.

" అదేమిటీ వాడి చదువు ముఖ్యమా మనకి ఇరుగు పొరుగు ఇళ్ళల్లో ఎవరెక్కడికి వెళ్ళారో ఆ విషయాలు ముఖ్యమా ? " నచ్చ చెప్పబోయాడు శివరావు.

" అబ్బా ! ఈ చదువు ఎప్పుడూ ఉండేదే లెద్దురూ ! అసలైనా కాన్వెంట్ స్కూల్ కాన్వెంట్ స్కూల్ అంటూ మురిసిపోతూ అందులో చేర్చారు. వాళ్ళసలెప్పుడూ చదువు చెప్పినట్టే కనిపించట్లేదు నాకు. ఎప్పుడూ పొద్దున్నా, రాత్రీ మీరు చదువు నేర్పడమే సరిపోతూంది "

" అందుకేగా తల్లిదండ్రులు చదువుకున్నవాళ్లైనా అని అడిగిగానీ పిల్లలకి సీట్లు ఇవ్వట్లేదు " నవ్వాడు శివరావు.

" పొద్దున్న ఆఫీసు కెళ్ళేదాకా ఏవో అడిగి చెప్పించుకుంటూనే ఉంటారు. మళ్ళీ రాత్రి నిద్రపోయేదాకా హోమ్‌వర్కు చేసినంతసేపూ మీరు పక్కన ఉండాల్సిందేనయ్యే. ఇంక మీరూ, నేనూ ముచ్చటగా నాలుగు మాటలు మాట్లాడుకొనేదెప్పుడు ? " చివరి మాటలు గొంతు తగ్గించి మెల్లిగా అంది.

" అదా అసలు నీ బాధ ? ముచ్చటగా మాట్లాడుకోవడం అంటే ఇలా పక్కింటి పారిజాతం ఇంట్లోంచి వెళ్ళిపోయిందనో, ఎదురింటి ఏడుకొండలు తాగొచ్చి గొడవ చేశాడనో ఇవా కబుర్లు. హతోస్మి ! వారానికో తెలుగు సినిమా చూస్తావు ఎందుకూ దండగ "

" అదేమిటి .... మధ్యలో తెలుగు సినిమాకీ, దీనికీ ఏమిటి సంబంధం ? " అర్థం కాలేదు కమలకి.

" ఎందుకు లేదూ ? సినిమాల్లో ఎంచక్కా ఇరవైనాలుగ్గంటలూ హీరో హీరోయిన్లు ముచ్చట్లు .... "

" ఆగండాగండి. హీరో హీరోయిన్లు ముచ్చటెక్కడ చెప్పుకుంటారు ? పాటలే పాడుకుంటారు. అదీ పార్కుల్లోనూ, రోడ్డుమీదానూ "

" సరే .... ఇవాళనుంచీ మనం కూడా పార్కులో " ....

" ఆహా .... ఇంట్లో రెండు ముక్కలు వరసగా రెండు నిమిషాల పాటు మాట్లాడుకుందుకు లేదుగాని, పార్కులోట పార్కులో " ముక్కూ మూతీ కూడా అందంగా చిట్లించింది.

" అమ్మగారూ ! పనై పోయింది. గిన్నెలు తోమేసి లోపలెట్టేశాను. నే నెల్తున్నాను " వెళ్ళిపోతూ ఓ కేక వేసింది గౌరమ్మ.

" అలాగే. వెళ్ళు. అ .... అన్నట్టు ఒక్క నిమిషం ఉండు గౌరమ్మా ! "

" ఏమిటమ్మగారూ ? "

" పారిజాతం కనిపించట్లేదుటగా అసలు విషయం ఏమై ఉంటుం దంటావు ? " గొంతు తగ్గించి అంటూ, గుమ్మంలో చతికిలపడింది. అది కూడా కూర్చుని పురాణం విప్పుతుందన్న ఆశ.

" ఏమోనమ్మగారూ ! నాకేం తెలుసు ? అయన్నీ తీరుబడిగా ఆళ్ళనీ ఈళ్ళనీ అడుగుతూ కూచుందుకు నాకు టయిము లేదమ్మగోరూ, అయిదారు ఇళ్ళల్లో పనిచేసుకునేదాన్ని. ఇంకా నాలుగిళ్ళల్లో పనుండి పోయింది. అవతల చూస్తే బారెడు పొద్దెక్కిపోయింది. నే పోతున్నా నమ్మగారూ " హడావిడిగా వెళ్ళిపోయింది గౌరమ్మ.

నోరెళ్ళబెట్టింది కమల. " దీనిల్లు బంగారంగానూ. ఏదో పెద్ద దేశానికి ప్రైమినిస్టర్లా దీని బిజీ మండిపోనూ. ఇదివరకటి పనిమనిషే నయం. అడక్కుండానే నాలుగిళ్ళ కబుర్లూ చేరేసేది. ఇదెప్పుడు చూసినా బిజీయే. కాలోచోట అన్చదు. దీన్ని పెట్టుకున్నాక ఏ ఇంటి కబుర్లూ దీనిద్వారా తెలిసిచావట్లేదు "

" అందరు పనిమనుషులూ ఈ అమ్మాయంత మంచివాళ్ళయితే ఎంత బాగుండును ! " లోపలనుకోబోయి పైకే అనేశాడు శివరావు.

" ఏమిటీ నా ఎదురుగానే గౌరమ్మని మెచ్చేసుకుంటున్నారే .... ఎంత ధైర్యం. అంతేలెండి మొగాళ్ళని నమ్మమని ఎక్కడుంది ? పైగా అమ్మాయట అమ్మాయి. తదేం చిన్నదా చితకదా ? " వస్తున్న నవ్వు నాపుకుంటూ, కోపం నటించింది.

" అయ్యబాబోయ్ ! చక్రం నా మీదకు తిప్పావా ? ఆఫీసుకి టైమై పోతూంది నాకు. టిఫిను చేసిపెట్టు త్వరగా " స్నానం చెయ్యాలన్న వంకతో అక్కడినించి జారుకున్నాడు.

*

" ఆ ఎదురింటి పారిజాతం ఇంట్లోంచి వెళ్ళిపోయిందండోయ్ ! "

" మంచి పని జరిగింది ఏ కృష్ణుడో ఎత్తుకెళ్ళుంటాడు. పోన్లే సుఖపడనీ "

" అవ్వ " నోరు నొక్కుకుంది సుభద్రమ్మ.

" ఇంట్లోంచి వెళ్ళిపోతే - మెచ్చుకుంటారేమిటి ? "

" లేకపోతే తిట్టమంటావా ? తాను సుఖపడదూ. మరొకళ్ళని సుఖపడనివ్వదూ ఈ లోకం. పాపం ! ఆ అమ్మాయి తన సుఖం తను చూసుకుంది తప్ప నీకుగానీ, నాకుగానీ అపకారం ఏం చెయ్యలేదుకదా ! "

" అయ్యోరామ ! ఎంతకి తెగించిందోనని ఊరూ, వాడా అనుకుంటుంటే మీరేమిటి ఆ పిల్లని వెనకేసుకొస్తున్నారు ? "

" ఉన్నమాటే అంటున్నాను. పెళ్ళయి రెండేళ్ళు కావస్తూంది. కట్నం డబ్బు పూర్తిగా అందితేగానీ, అమ్మాయిని కాపరానికి తీసికెళ్ళేది లేదని, పెళ్ళయిన రోజునించి ఈ రోజు వరకూ పుట్టింట్లోనే ఉంచేశారు ఆ అత్తగారూ వాళ్ళు పుట్టింటి వాళ్ళేమో ఇంతవరకూ డబ్బు కూడక ఇవ్వలేకపోయారు. మధ్యలో నలిగి పోతూందా అమ్మాయి. పోనీ ఆ కట్టుకున్నవాడైనా ధైర్యం చేసో, తన తల్లిదండ్రులకి నచ్చచెప్పో భార్యని తీసికెళ్తాడా అంటే అదీ లేదు. ఇరుగూ పొరుగూ అనే సూటీ పోటీ మాటలూ, వాళ్ళూ వీళ్ళూ చూసే వంకర చూపులూ ఎన్నాళ్ళని భరిస్తుంది ఆ అమ్మాయి మాత్రం ? ఇన్నాళ్ళూ ఆ అమ్మాయి మానసికంగా

నరకయాతన అనుభవించినప్పుడు తన కేమీ పట్టనట్టు ఉన్న సమాజం, ఇప్పుడు ఆ అమ్మాయి ఇంట్లోంచి వెళ్ళిపోయిందని తెలియగానే అలా చేసిందేమిటి ? అలాంటి పని చెయ్యకూడదు. పరువేమన్నా మిగులుతుందా ఇంక ? అంటూ నీతులు బోధించడానికి మటుకు తయారవుతుంది ఆదే నచ్చదు నాకు. అందుకే ఈ సమాజం మారాలి. సమాజం అంటే ఎవరో కాదు. మనబోటివాళ్ళే, నిజంగా మనం మానవత్వం ఉన్న వాళ్ళమయితే, ఆ అమ్మాయి ఏ ఆత్మహత్యే చేసుకోకుండా ఎక్కడో అక్కడ సుఖంగా ఉంటే చాలని అనుకోవాలి " లెక్చరరు పేరు సార్థకం చేసుకున్నాడు వెంకట్రామయ్య ఓ లెక్చరిచ్చి.

" అబ్బా ! అయిందా మీ లెక్చరివ్వడం ? మీకేవీఁ లోకజ్ఞానం లేదు. ఆ ఎదురింటి బ్రహ్మచారి కుర్రాడూ పత్తా లేడుట తెల్లారేటప్పటికి"

" సరే ! ఇంక నీ కెంత చెప్పి ఏం లాభం ? లోకజ్ఞానమంతా మీ ఆడవాళ్ళసొత్తే అనుకుంటావు. పోన్లే అలాగే అనుకో. ఈ మగాళ్ళందుకూ పనికిరారని నీ ఉద్దేశంగానీ, ఇక్కడ కావలసింది లోకజ్ఞానం కాదు. ఎదటి మనిషి కష్టం, సుఖం అర్థంచేసుకోవడం కావాలి. అయినా, ఆ అమ్మాయి కనపడకపోవటానికీ, ఈ అబ్బాయి ఊళ్ళో లేకపోవటానికీ లంకె పెడతావెందుకూ ? తెలిసీ తెలియని మాటలు మన కెందుకు చెప్పు "

" అయ్యోరామ ! ఊరంతా కోడైకూస్తుంటే మీ రేవిఁటో ఉత్త అమాయకుల్లా మాట్లాడుతారు. అందుకే మీకు లోకజ్ఞానం లేదు. లోకం తెలియదు అంటాను "

" లోకజ్ఞానం అంటే ఇంకోళ్ళ గురించి చెవులు కొరుక్కోవడం అనా నీ ఉద్దేశం ? అదే అయితే, అటువంటి లోకజ్ఞానం నా కొద్దులే " ఒక్క ముక్కలో తేల్చి చెప్పేశాడు వెంకట్రామయ్య.

*

పారిజాతం ఇంట్లో వాళ్ళంతా మొహాన గంట్లు పెట్టుకూర్చుని ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందుల మూలంగా, తమకి పెళ్ళిళ్ళవడం ఆలస్యమై పోతూందని ఇన్నాళ్ళుగా దిగులు పెట్టుకూచున్న చెల్లెళ్ళు ముగ్గురికీ కూడా ఇప్పుడు కొత్త చింత పట్టుకుంది. అక్క ఇలా చేయడంవల్ల అసలీ జన్మలో తమ పెళ్ళిళ్ళు అవుతాయా అని. ఆ దిగు ప్పుడే వాళ్ళ కళ్ళల్లో నిండిపోయింది. తమ్ముళ్ళు ఇద్దరూ చిన్నవాళ్ళు. బిక్క మొహాలేసు కూర్చుని చూస్తున్నారు. కోపంతో కుతకుత ఉడికిపోతూంది తండ్రి మనసు.

ఇల్లొదిలిపోయే ధైర్యం ఎలా వచ్చిందసలు దానికి ? ఉత్త అమాయకురాలు. ఏ సత్రేట్లో మునిగిందో ? ఏమో అనుకుంది తల్లి మనసు.

" అసలు తప్పంతా మీదే. అంత కట్నం డబ్బు మనం ఇచ్చుకో లేమని తెలిసికూడా, ఆ సంబంధానికే ఎగబడటం మీ మొదటి తప్పు. ఇస్తాను, ఇస్తానని వాళ్ళ కట్నం డబ్బు ఇన్నాళ్ళు ఇవ్వకుండా ఉండటం, పిల్లని కాపరానికి పంపే మార్గం చూడకుండా కూచోటం రెండో తప్పు " ఉండబట్టలేక బాధ వెళ్ళగక్కింది.

" ఏం చెయ్యమన్నావు ? నువ్వే చూస్తున్నావుగా! ఎప్పటికప్పుడు ఏవో ఖర్చులొచ్చి నెత్తిన పడుతూనే ఉన్నాయి. దానికితోడు పంట సరీగ్గా రాక, ఆ ఉన్న పొలం కాస్తా అమ్ముకోవలసొచ్చింది. ఆ పొలం అమ్మగా వచ్చిన డబ్బు అప్పులు తీర్చడానికీ, నా అనారోగ్యానికీ, చిన్నవాడి ఆపరేషన్‌కీ సరిపోయింది. మిగిలింది సున్నా. సొంత ఇల్లంటూ లేదు. ఉన్న కాస్త పొలమూ పోయింది. వెనకేసిందో పైసా లేదు. మధ్యవర్తి మాట నమ్మి కట్నం అట్టే తీసుకోని సంబంధం అనుకుని ఆ సంబంధాని కెళ్ళాను. అమ్మాయీ, అబ్బాయీ ఇష్టపడ్డారు.

అన్నీ కుదిరాయి అని సంబరపడి, తీరా నిశ్చయం చేసుకోబోతుండగా, వాళ్ళ గొంతెమ్మ కోరికలూ, కట్నాలూ, కానుకలూ ఒక్కొక్కటీ బయట పెట్టారు. అప్పుడు కాదని వెనుతియ్యటానికి అభిమానం అడ్డొచ్చింది వాళ్ళడిగినవన్నీ ఒప్పేసుకున్నాను "

" ఇప్పుడు అనుభవిస్తున్నాం " మాట పూర్తిచేసి దావిడ.

" ఆ మధ్య అమ్మాయిని తీసుకుని వియ్యాలవారింటికి వెళ్ళలేదేమిటీ నేను ? కట్నం డబ్బు పూర్తిగా ముట్టచెప్పేదాకా కోడలా ఇంటి గడపలో అడుగుపెట్టడానికి వీల్లేదని నోటి కొచ్చినట్లు నానా మాటలూ అన్నాడు ఆ వియ్యంకుడు. దాంతో నా కసలే మొదటినుంచీ రోషం ఎక్కువ. నీకూ తెలుసు ఆ సంగతి. ఆ వియ్యంకుడే స్వయంగా కోడల్ని తీసుకు రమ్మని పిలిచేదాకా ఆ ఇంటి గడప నా కూతుర్ని తొక్కనివ్వకూడదని నిశ్చయం చేసుకున్నాను "

" మీ వియ్యంకుల నిర్ణయాలూ, పంతాలూ ఇప్పుడీ స్థితిని తెచ్చి పెట్టాయి మనకి. తలకు మించిన బరువు ఎత్తుకోవద్దనీ, ఈ సంబంధం నిశ్చయం చేసకోబోయే ముందే చెప్పాను మీకు నేను. విన్నారు కాదు మీరు. " గొంతు జీరబోయి మరి మాట్లాడలేకబోయింది కాంతమ్మ.

*

" అప్రాచ్యుడు. డొక్క చీల్చి డోలు కట్టాలి "

" ఎవరండీ ? "

" ఇంకెవరూ నీ సుపుత్రుడే " కొడుకు మీది కోపం భార్య మీద చూపిస్తూ కస్సుమన్నాడు పార్వతీశం

" బాగుంది. మీకు నచ్చిన పని చేసినప్పుడు మీ సుపుత్రుడు, నచ్చని పని చేసినప్పుడు నా సుపుత్రుడూ అంటారు. అసలింతకీ ఏం చేశాడు ? "

" ఎవరో అమ్మాయిని ఇంట్లో తెచ్చిపెట్టుకున్నాట్ట. ఇద్దరూ కలిసే ఉంటున్నార్ట ఎంచక్కా "

" అయ్యో ! దేవుడా, అయింది. అనుకున్నంతా అయింది "

" ముందే అనుకున్నావా ? అయితే నీకు తెలుసన్నమాట ఈ భాగవతం "

" నాకే భాగవతమూ తెలియదు "

" మరి అనుకున్నది అయిందంటావు ? "

" మీరు పట్టుదలలూ పంతాలూ తోటి రోజులకి రోజులు బిగుసుకుపోయి కూచుంటుంటే, ఏదో ఒకరోజు విసుగుపుట్టి వాడిలాంటి పని చేస్తాడేమోనని భయంతో ఛస్తున్నాను. అందుకని నే ననుకున్నదంతా అయిందని అన్నాను "

" ఉద్ధరించావు "

" నా మీద కోపం తెచ్చుకుంటే ఏం లాభం ? పెళ్ళప్పుడు ఆ పిల్ల తండ్రి కాళ్ళావేళ్ళా పడితే వినకపోతిరి. ఆ తరువాత ఆ మధ్య ఓసారి ఆయన కూతుర్ని తీసుకువస్తే నానా మాటలూ అన్నారు మీరు. దాంతో ఆయనా ఇంతెత్తున లేచారు. మాటా మాటా పెరిగి ఆయనకీ పంతం పెరిగింది. మధ్యలో నలిగిపోతున్నది మన పిల్లలే అన్న సంగతి మీ రిద్దరూ మరచిపోతున్నారు. ఇప్పుడు చూడండి-ఎంత పని జరిగిందో ! ఏ కులం కాని దాన్నో వాడు తెచ్చిపెట్టుకోవడం బాగుంటుందా ? "

" అంత పని వాడు చేస్తే నే నూరుకుంటానా ? "

" అసలింతకీ ఈ వార్త చెప్పిందెవరూ మీకు ? "

" ఎవడో చెప్పాడు వల్లకాట్లో రామలింగయ్య. ఎవరైతే నీ కెందుకూ ? "

" అబ్బబ్బ ! వాడిమీద కోపమంతా నా మీద చూపిస్తారు కదా "

" నే ఇప్పుడే బస్సుకి బయల్దేరి కోడలి వాళ్ల ఊరెళ్ళి, ఆ పిల్లని తీసుకుని వెళ్ళి మనబ్బాయి ముందు నిలబెడతాను. వాడి తిక్క కుదురుతుంది. వాడితో కలిసి ఉంటున్న ఆ పిల్ల ఎవత్తో గానీ తోక ముడుచుకు పోవల్సిందే "

*

హఠాత్తుగా ఊడిపడిన వియ్యంకుణ్ణి చూస్తూనే గుండెల్లో రాయి పడింది పారిజాతం తండ్రి ఆదినారాయణకి.

" త్వరగా కోడలు పిల్లనిప్పుడు నాతో పంపండి. అబ్బాయి దగ్గర దింపేసి వస్తాను " ఒక్క ముక్కలో తా నొచ్చిన పని చెప్పేశాడు పార్వతీశం.

నిర్ఘాంతపోయాడు ఆదినారాయణ.

పిల్ల ఇంట్లోంచి వెళ్ళిపోయిందన్న సంగతి విని కావాలనే తప్పు తన మీద లేదని అనిపించుకుందుకు ఈ సమయం చూసి వచ్చినట్టున్నాడు. ఈ గండం గడిచే దెలా ?

చేతులు నలుపుకుంటూ, తడబడే గొంతుతో నసిగాడు చిన్నగా.

" అదేమిటి బావగారూ ! ఉన్నపళంగా పిల్లని కాపరానికి పంపమంటే మరీ ఉత్తచేతుల్తో ఎలా పంపనూ ? మొదటిసారి పంపడమయ్యే ! "

" ఇప్పుడు పంపి తీరాలి. ఉత్త చేతుల్తోనే పంపించండి. మరేం పరవాలేదు. లేకపోతే కుదరదు. అవతల కొంపంటుకు పోయాయి "

" ఏమైంది బావగారూ ! "

" మీ అల్లుడు ఎవత్తెనో తెచ్చుకుని సంసారం మొదలు పెట్టాడు. అందుకే కోడలు పిల్లని తీసికెళ్ళి వాడి తప్పు చెప్పి. వాడికీ, ఆ వచ్చిన వన్నెల విసనకర్రకీ ఇంత గడ్డి పెడదామనుకుంటున్నాను "

ఎంత పని జరిగిపోయింది ? ఇప్పుడు కాపరానికి పంపకపోతే, ఇంక తన కూతురి కాపరం చక్కబడే అవకాశమే రాదేమో ! ఎలాంటి పరిస్థితి తెచ్చిపెట్టావయ్యా దేవుడా !

" అది కాదు బావగారూ ! మరి కట్నం సొమ్మింకా .... "

" మీరు కట్నం ఇవ్వద్దు, కానుక లివ్వద్దూ. మళ్ళీ కట్నం మాట నే నెత్తితే ఒట్టు. అమ్మాయిని త్వరగా బయల్దే మనండి. బస్సు కింక అట్టే టైము లేదు. మీరు కూడా మాతో వస్తే మంచిది "

కట్నం సొమ్ము వద్దన్నందుకు సంతోషపడిపోయి, కాళ్ళు పట్టుకున్నంత పని చేస్తాడనుకున్నాడు. అదేమీ కాకపోగా తలొంచుకుని, మాట్లాడకుండా వియ్యంకుడు నిలబడి పోవడం ఆశ్చర్య మనిపించింది పార్వతీశానికి.

ఇవాళ కాకపోతే రేపైనా ఊళ్ళోవాళ్ళ ద్వారా నిజం తెలిసి పోతుందని, తనే అసలు విషయం వియ్యంకుడికి చెప్పేశాడు ఆదినారాయణ.

" ఏమిటీ అమ్మాయి కనిపించట్లేదా ? రామరామ ఎంత అప్రతిష్ఠ ? నిప్పులాంటి వంశం మీదనుకున్నాను. అమ్మాయి అమాయకురాలని అపోహపడ్డాను " నోటికొచ్చినట్లు మాట్లాడుతూ, మెల్లగా తిట్లు మొదలు పెట్టాడు పార్వతీశం.

మరి వినలేక ఆవేశంతో, బాధతో ఒక్క ఉదుటున పక్క గది లోంచి ఇవతలకి వచ్చింది పారిజాతం పెద్ద చెల్లెలు.

" ఆపండి మీ తిట్లు ! మీ లాంటివాళ్ళకి తిట్టే అర్హత కూడా లేదసలు. డబ్బే తప్ప మనిషి మనసుతో మీబోటివాళ్ళకి పని లేదుగా ? ఆడదీ ఓ మనిషనీ, ఆమెకీ ఓ మనసుంటుందనీ ఒప్పుకోరు మీలాంటి వాళ్ళు. అటువంటివాళ్ళకి తిట్టే అర్హత ఎందుకుంటుందీ ? ఇన్నాళ్ళూ

మా అక్క లోలోపల ఎంత కుళ్ళి ఏడ్చుకున్నా మీకు పట్టలేదు. ఇప్పుడు మీ అబ్బాయి ఎవరినో తెచ్చేసుకున్నాడని మీ పరువు దక్కించుకోవడం కోసం ఇప్పుడీ కోడలుపిల్ల గుర్తొచ్చింది అంతేనా ? "

" అమ్మాయ్ ! నువ్వు లోపలికెళ్ళు తల్లీ. ఆవేశపడకు " మధ్యలో అడ్డుకున్నాడు తండ్రి భయంగా చూస్తూ.

" ఎందుకు నాన్నగారూ భయపడతారు ? ఈ భయం .... అంత కట్నం ఇవ్వడానికి ఒప్పుకునే ఆ రోజు ఉండవలసింది. "

"ఛ....ఛ....ఈ ఇంట్లో ఇంకొక్క క్షణం కూడా ఉండకూడదు." గట్టిగా అరుస్తూ, తిడుతూ చరచరా వెళ్ళిపోయాడు పార్వతీశం.

*

తలుపుతీసిన మాధవ్ తండ్రిని చూస్తూనే కొంచెం తడబడిన మాట నిజం.

"రండి నాన్నగారూ ఉత్తరమైనా రాయకపోయారా వస్తున్నట్టు...."

"ఏం ? రాస్తే ఆడుతున్న నాటకం కప్పిపుచ్చుకుందామనుకున్నావా?" కోపంగా అంటూ విసురుగా లోపలికి అడుగుపెట్టాడు పార్వతీశం.

గుటకలు మింగాడు మాధవ్. "ఇలా కూర్చోండి కాఫీ తాగి...."

" అక్కర్లేదు. దాని చేతి కాఫీ తాగే ఖర్మం పటలేదు నాకు. దాన్నిలా పిలు ముందు. ఇంత గడ్డి పెడతాను." లోపలి గదివైపు చూశాడు.

" తనదేం తప్పులేదు నాన్నగారూ ! నేను నమ్మని బలవంతం పెట్టి తీసుకొచ్చాను. తనమీద కోపం తెచ్చుకోవద్దు మీరు."

" సిగ్గులేకపోతే సరి. వెనకేసుకొస్తున్నాడు. తనదేం తప్పు లేదుట. ఆ మాట చెప్పడానికి నువ్వెవరు ? "

" తన భర్తని కాబట్టి "

" ఏవిటేవిటీ ? అంతవరకూ వచ్చిందా వ్యవహారం ! ఇప్పుడే తాడో పేడో తేలుస్తాను. పెళ్ళాడిన పిల్లని వదిలేసి, ఇంకెవత్తినో తెచ్చుకుని, నా భార్య అంటే...."

" ఏవిటి నాన్నగారూ మీ రనేది ? నాకేం అర్థం కావట్లేదు. పారిజాతం !....పారిజాతం....ఇలా వస్తావా ఒకసారి ? "

లోపలి గదిలోంచి వచ్చి, తలవంచుకుని నిలబడింది పారిజాతం.

తెల్లబోయాడు పార్వతీశం. " ఈ అమ్మాయి....ఇక్కడ నీ దగ్గరుందా ? నువ్వు సంసారం చేస్తున్నది నీ భార్యతోనేనా ? "

" వస్తూనే మీరు కోపంగా మాట్లాడితే, మీకు తెలియకుండా, మీ ఎవరి అనుమతీ లేకుండా నేను పారిజాతాన్ని తీసుకొచ్చినందుకు అలా కోపం చూపిస్తున్నారనుకున్నాను. "

"నీ భార్య ఎవరో తెలియని వాడొకడు తెలిసీ తెలియని మాటలేవో అంటే, అవి నమ్మేశాన్నేను, ఈ అమ్మాయి ఎక్కడుందో తెలియక వీళ్ళింట్లోవాళ్ళు మథనపడిపోతున్నారు పాపం ? "

" తనిక్కడ వున్నట్టుగా వాళ్ళ వాళ్ళకి ఉత్తరం రాయించాను.... ఇంకా అందలేదు కాబోలా ఉత్తరం. క్షమించండి నాన్నగారూ ! ఇన్నాళ్ళుగా ఎదురుచూశాను, మీ పంతాలూ, పట్టింపులూ వదులుకుంటారేమోనని. ఫలితం లేకపోయింది కాస్త ఆలస్యమైనా కూడా, ఇప్పటికైనా నేను కళ్ళుతెరిచి నడుచుకోకపోతే లాభం లేదని, వాళ్ళ ఊరు వెళ్ళి రహస్యంగా పారిజాతాన్ని కలుసుకున్నాను. పెద్దవాళ్ళకి తెలియకుండా నాతో రావడానికి తను భయపడుతుంటే నేనే బలవంతంపెట్టి తీసుకొచ్చేశాను రాత్రికి రాత్రి. "

డబ్బుకంటే ముఖ్యమైనది మనుషులమధ్య బంధాలేనన్న సత్యం ఇన్నాళ్ళకి అర్థమైంది పార్వతీశానికి. ప్రేమగా కొడుకు భుజంమీద చెయ్యివేసి నవ్వుతూ అన్నాడు. " మీ పారిజాతాపహరణం గావించింది మా మాధవుడేనని వియ్యంకుడికి వెంటనే తెలియబరుస్తాను. "